ప్రతి కార్యకర్త టీడీపీ వైఫల్యాలను ప్రజలకు చెప్పాలి



చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి
- ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై, టీడీపీ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించి ప్రశ్నించే విధంగా వారిని చైతన్యపరచాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సీఎంఆర్ కల్యాణమండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, చంద్రబాబు మేనిఫెస్టో ప్రజలకు గుర్తు తెస్తూ కార్యక్రమంపై మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డిలకు పార్టీ నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. వారు చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ వంటి హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. ప్రతి రైతుకు రూ.20వేలు ఇవ్వాలన్న ప్రకటన వాయిదాల మీద ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు రైతులకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నిరాశలో ఉన్నారన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల నియామకాలను పక్కన పడేశారన్నారు. పోలీసులు లేకుండా గ్రామాల్లోకి వెళితే చంద్రబాబు పాలన గురించి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. వైఎస్ జగన్ పాలనలో కులమతాలకు అతీతంగా ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. చంద్రబాబు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ఆడబిడ్డ పథకం కింద రూ.1500 ఇస్తామని చెప్పారని, కానీ ఇంత వరకు ఆ ఊసే లేదని విమర్శించారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పారు కానీ సగం మందికిపైగా ఆ పథకం అందడం లేదన్నారు. వైఎస్ జగన్ 2.0లో పార్టీ ప్రజలు ఒక వైపు, కార్యకర్తలు మరో వైపు అనే నినాదంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రతి కార్యకర్త చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

కమీషన్లకు కక్కుర్తి

ప్రశాంతంగా ఉన్న బద్వేలు నియోజకవర్గాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. ఎప్పుడు ఇలాంటి సంస్కృతి నియోజకవర్గంలో లేదన్నారు. దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని.. ఆయన మనవడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి నేడు కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్ల దగ్గర రూ.50 లక్షలు - రూ.60లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన తాత వీరారెడ్డి వంద ఎకరాల ఆస్తులను కూడబెట్టి ఇచ్చారని.. ఇప్పుడు కమీషన్లకు కక్కుర్తి పడటం ఏమిటని ఎద్దేవా చేశారు. వంద ఎకరాల భూముల్లో కొంత ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి రితేష్ రెడ్డి బిల్డింగ్‌లు కట్టించి బాడుగలకు ఇచ్చారన్నారు. 20 ఏళ్లుగా రాజకీయంలో ఉన్న తాను ఎలాంటి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయలేదని గోవిందరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలన్నారు. చంద్రబాబు పోలీసులను అడ్డు పెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించేందుకు పన్నాగం చేస్తున్నారని, దానిని అడ్డుకుంటామని పేర్కొన్నారు.

■ అబద్ధపు హామీలను ఇచ్చి ఎన్నికల్లో గెలుచిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఎవరు భయపడ కుండా పార్టీ కోసం పనిచేయాలని, మీకు అండగా మేము ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, సుధ రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏవీ భాస్కర్‌రెడ్డి, పోకల రామకృష్ణారెడ్డి, సింగరయ్య, వావిళ్ల గురవయ్య, వెంకటరామిరెడ్డి, నాగూర్ షరీఫ్, కె.సుబ్బారెడ్డి, రాంబాబు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళదాం



క్యూ ఆర్‌కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ (అట్లూరు) : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళదామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కుంభగిరి సమీపంలో గల వ్యవసాయ క్షేత్రంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమ కార్యాచరణపై నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి రుజువు చేయాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందని, ఇందులో భాగంగా త్వరలో ప్రారంభం కానున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి చంద్రబాబు ఇచ్చిన హామీలు మీ ఇంటికి చేరాయా లేదా అని అడగడంతో పాటు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయించి కూటమి పాలనలో ప్రజలు ఎంతమేర నష్టపోయారో వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ అట్లూరు మండల అధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు బాలమునిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.సూరారెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ మాధవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బ్రహ్మానంద రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ మణిస్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడు కె.లక్ష్మిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, ముఖ్య నేతలు బాలకృష్ణారెడ్డి, పి.శ్రీనివాసులు, సుబ్బరాయుడు, లక్ష్మీనరసారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె



మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి ఐదవ రోజుకు చేరుకుంది. కార్మికులంతా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. విజయవాడలో జరిగిన సీడీఎం కార్యాలయ ముట్టడికి ప్రొద్దుటూరు నుంచి 50 మంది కార్మికులు తరలి వెళ్లినట్లు తెలిపారు.

పరామర్శ



రఘునాథరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయుడు, తన బామ్మర్ది అయిన పాలగిరి రఘునాథరెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల రఘునాథరెడ్డి సతీమణి హైమావతి మృతి చెందింది. ఇదే క్రమంలో రఘునాథరెడ్డి చేతికి ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద విద్యానికేతన్ కరస్పాండెంటు నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లేలా ప్రోత్సహించాలి



హెచ్‌ఎం శర్మకు వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి

చాపాడు : పాఠశాలకు వచ్చే విద్యార్థులు తరచుగా గ్రంథాలయానికి వెళ్లే విధంగా ప్రోత్సహించాలని గ్రంథాలయ అధికారి జే.శివశంకర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం కమలానంద శర్మను గురువారం గ్రంథాలయ అధికారి కలసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయంలో సెలవు దినాలతో పాటు ప్రతి ఆదివారం గ్రంథాలయంకు విద్యార్థులు వచ్చి వార్తా పత్రికలు, విజ్ఞాన పుస్తకాలను చదువుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ శాఖ 'చదువడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నక్కలదిన్నె టీడీసీ రవి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : విజయవాడలో ఈనెల 21న జరిగే ధర్నాను ఏపీ డిస్కం, జెన్‌కో, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరూ జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రొద్దుటూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, డివిజన్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి కోరారు. ధర్నా కార్యక్రమానికి సంబంధించి గురువారం ప్రొద్దుటూరులోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరిని సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ఎస్కో అకౌంట్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. 2022 ఏప్రిల్ 1 నుంచి పీఆర్సీ అరియర్స్‌ను ఏకమొత్తంగా ఇవ్వాలని, జేఎల్‌ఎంలకు ఏపీఎస్ఈబీ రూల్స్ అమలు చేసి ఏఎల్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన ఆపరేటర్లకు, పాత ఆపరేటర్లకు మధ్య వేతన వ్యత్యాసాన్ని సరిచేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన విద్యుత్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వ తరహాలో రూ.కోటి ప్రమాద బీమా ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరత్నాచారి, జూనియర్ లైన్‌మెన్లు పోలయ్య, సంజీవరాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం పోరుమామిళ్ల రెడ్డినగర్‌లోని చిత్తా గ్రాండ్ ఫోర్ట్ ఫంక్షన్ హాలులో జరుగుతుందని పార్టీ కార్యాలయం వెల్లడించింది. గురువారం కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో ఉదయం 9 గంటలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం మొదలవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైద్యుల నిరసన ర్యాలీ

పోరుమామిళ్ల : మహబూబ్‌నగర్‌లో వైద్యులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం పోరుమామిళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆప్కాస్ మాజీ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ జరుగుతుందని, ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపిచ్చారు. మధ్యాహ్నం 2-30 గంటల నుండి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

పోషక ఆహారంతోనే ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నందిపల్లె గ్రామంలో విద్యార్థులకు, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నివారణ అనే అంశాలపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

పోరుమామిళ్ల : ఈ నెల 22, 23, 24 తేదీల్లో బద్వేలులో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా మహాసభలకు పోరుమామిళ్లలో గురువారం ఆ పార్టీ నాయకులు విరాళాలు సేకరించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి నాయకులు, కార్యకర్తలు విరాళాలు సేకరించారు. కేశవ, సునీల్, చెన్నయ్య, వీరయ్య, విశ్వాసమ్మ పాల్గొన్నారు.

మురికి నీటి సమస్యను పరిష్కరించండి



మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు మోడంపల్లె ఎస్సీ కాలనీలో సైడ్ కాలువలు పొంగి చెరువు కుంటలను తలపించే విధంగా మురికి నీలిచిందని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ ఇంజినీర్ ఎంవీ శ్రీనివాసులుకు ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యల్లయ్య మాదిగ మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో కాలనీ వాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డుపై మురికి నీరు నిలబడి ఉండటం వల్ల నరసింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఆ మురికి నీటిలో నడుచుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. సంవత్సరాల తరబడి ఈ సమస్యను పరిష్కరించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నరసింహస్వామి ఆలయ తూర్పు భాగంలో ఉత్తరం, దక్షిణం వైపుగా సిమెంటు రోడ్డును కొత్తపల్లె కాలువ వరకు నిర్మించారన్నారు. కానీ మురికి కాలువలు నిర్మించలేదన్నారు. అందువల్లే ఎస్సీ కాలనీలో మురికి నీరు పోవడానికి దారి లేదన్నారు. ఇప్పటికైనా సిమెంట్ రోడ్డుకు మురికి కాలువలను నిర్మిస్తే కాలనీలోని మురికి నీరు కొత్తపల్లె కాలువలో కలుస్తాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈనెల 28న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (బ్రహ్మయ్య మాదిగ వర్గం) జిల్లా అధ్యక్షుడు గద్దం నరసింహులు మాదిగ, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఆవుల రాజా, సగబాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక హామీల అమలులో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లురఘునాథరెడ్డి

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన ఆర్థికపరమైన హామీల అమలులో నిర్లక్ష్యం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం బద్వేలులో నిర్వహించిన ఎస్టీయూ బద్వేలు ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులను సైతం తీవ్రంగా మోసం చేస్తోందని, చనిపోయిన వారికి మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదని, 2022 నుండి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు ఇంతవరకు మంజూరు చేయలేదని అన్నారు. అధికారంలోకి రాగానే సకాలంలో ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు సంఘాల నాయకులను చర్చలకే ఆహ్వానించలేదన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వి.సుబ్బారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, పి.వి.కృష్ణారెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు సుభాష్‌చంద్రరెడ్డి, కరిముల్లా, ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.పద్మనాభరావు, చల్లానరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, బి.శ్రీనివాస్, కె.రమేష్, జకరయ్య, ఎం.రామసుబ్బయ్య, ఎ.విజయభాస్కర్ రెడ్డి, సి.రమణారెడ్డి, కో కన్వీనర్ టి.వెంకటసుబ్బయ్య, బద్వేలు మండల అధ్యక్షుడు ఎస్.రమేష్‌రాజా, మండల కార్యవర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చేతిలో కీలుబొమ్మగా ఎన్నికల కమిషన్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ శక్తులను సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటోందని, ఈ కోవలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ సైతం మోదీ చేతిలో కీలుబొమ్మగా మారిందని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అంతా కార్పొరేట్ వర్గాలకు దోచిపెడుతోందని అన్నారు. ఈ దోపిడీలను వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులను ఆపరేషన్ కగార్ పేరుతో చంపుతున్నారని, దీనిని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఇచ్చిన అరకొర పథకాలలో అనేక రకమైన ఆంక్షలు పెట్టి కోతలు విధిస్తున్నారని అన్నారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బందెలఓబయ్య, జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంగటిచంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, అనిల్, రమణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టా నరనరాల్లో అవినీతి ఉంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

- కార్యకర్తల మేలు కోరేవాడివైతే అవిశ్వాసం పెట్టి మున్సిపల్ చైర్మన్‌ను దించు
- పుట్టాపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : అవినీతి పుట్టా నరనరాల్లోనే ఉందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తనపై అవినీతి ఆరోపణలు చేయడంపై రఘురామిరెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పుట్టా సుధాకర్ యాదవ్ దగ్గర నుంచే అవినీతి పుట్టిందని.. అది ఆయన నరనరాల్లోనే ఉందని అయినా, ఆయన ప్రభుత్వం అవినీతి చక్రవర్తులని ధ్వజమెత్తారు. మైదుకూరులో 2014-19లో టీడీపీ హయాంలో ఎంత అవినీతి జరిగిందో అందరికీ తెలుసునన్నారు. రోడ్లు వేయకుండానే, మరుగుదొడ్లు కట్టకుండానే రూ.కోట్లు బిల్లులు చేసుకుని దండుకున్నది అవినీతి కాదా అన్నారు. విజిలెన్స్ విచారణతో అధికారులు, కాంట్రాక్టర్లు జైలుకు వెళ్లిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. మైదుకూరు నియజకవర్గం గుండా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను అడ్డుకుని వారి వాహనాలను సీజ్ చేయించడం అవినీతి కాదా అని రఘురామిరెడ్డి ప్రశ్నించారు. తిప్పిరెడ్డిపల్లె చెరువు నుంచి అనుమతులు లేకుండానే తన కంపెనీ వాహనాలతో మట్టి తోలి అమ్ముకున్నది అవినీతి కాదా అన్నారు. మున్సిపాలిటీ ఇంజనీర్ నిరంజన్‌రెడ్డిని అవినీతిపరుడుగా పేర్కొంటూ వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు ఉమ్మడిగా తీర్మానం చేసి పంపిస్తే, ఇప్పుడు అదే నిరంజన్‌రెడ్డిని పుట్టా సిఫారసు చేసి మున్సిపాలిటీ ఏఈగా ఎలా వేయించారు, అవినీతి చక్రవర్తి కాబట్టేనన్నారు. తాను భూములను ఆక్రమించినట్టు ఆరోపిస్తున్న పుట్టా మైదుకూరు మండలంలో తన తమ్ముడు ప్రభాకర్ యాదవ్‌కు భూములు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. 2014 నుంచి 24 వరకు తాను ఎమ్మెల్యేగా ఉంటే అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే కోటీశ్వరుడైన ప్రభాకర్‌కు ప్రభుత్వ భములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

అవిశ్వాసం పెట్టి మున్సిపల్ చైర్మన్‌ను దించు..

తన పార్టీ కార్యకర్తలపై పుట్టాకు చిత్తశుద్ధి ఉంటే మున్సిపల్ చైర్మన్ చంద్రపై అవిశ్వాసాన్ని పెట్టి పదవి నుంచి దించాలని రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తమపార్టీ తరపున చంద్ర, టీడీపీ తరపున జగన్ భార్య పోటీ చేసి పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెట్టారని రఘురామిరెడ్డి తెలిపారు. జగన్ ఓడిపోయి అప్పులతో ఇబ్బందులు పడుతున్నాడని అన్నారు. అలాంటి కార్యకర్తను పార్టీ అధికారంలోకి రాగానే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అయినా ఇవ్వచ్చు కదా అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి చంద్రను దించాలనుకున్నారని, అలా జరగకుండా వైఎస్సార్‌సీపీ అడ్డుకుందని రఘురామిరెడ్డి తెలిపారు. అయితే ఇప్పుడు చంద్ర తమ పార్టీని వీడాడని పేర్కొన్నారు. జగన్ అన్ని విధాలా నష్టపోయాడని అతనికి పుట్టా న్యాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా జగన్‌కు అండగా ఉండాలని ఉంటే, కార్యకర్తలపై చిత్తశుద్ధి ఉంటే మున్సిపల్ చైర్మన్ చంద్రపై అవిశ్వాసం పెట్టాలన్నారు. అందుకు తమ పార్టీ కౌన్సిలర్ల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. చంద్ర పదవీచ్యుతుడు కాకుండా కాపాడేందుకు అతని వద్ద ఎంత డబ్బు తీసుకున్నాడో చెప్పాలన్నారు. డబ్బు తీసుకోలేదని రుజువు చేసుకునేందుకు చంద్రపై అవిశ్వాసం పెడితే తక్షణమే తమ పార్టీ కౌన్సిలర్లు సంతకాలు పెడతారన్నారు. ఇది వైఎస్సార్‌సీపీ ఇస్తున్న ఆఫర్ అని.. దీనిని వినియోగించుకుని చంద్రను పదవి నుంచి దించితే పుట్టాకు చిత్తశుద్ధి ఉన్నట్టేనని, లేదంటే చైర్మన్‌తో లాలూచీ పడినట్టేనన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, ఎంఆర్‌ఎఫ్ సుబ్బయ్య, భరత్, రఘురామయ్య, ఏసీకే రమణ, పిల్లి నాగయ్య, భూమిరెడ్డి సుబ్బరాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామొయినుద్దీన్

దువ్వూరు : ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామొయినుద్దీన్ తెలిపారు. మండలంలోని కృష్ణంపల్లెలో గురువారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు అందుబాటులో ఉన్న న్యాయ చట్టాలను తెలుసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కృష్ణంపల్లె గ్రామాన్ని దత్తత తీకున్నట్లు తెలిపారు. ప్రజలకు చట్టాల గురించి తెలిపి సత్వర న్యాయం అందించడమే న్యాయవిజ్ఞాన సదస్సు లక్ష్యం అన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరికి చట్టాలు ఉంటాయని వాటిని తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండకముందే ఆడ పిల్లలకు వివాహం చేయడం నేరమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై అవగాహన అవసరమని, ఈకేసుల్లో వారికి ఉచిత న్యాయ సహాయంతోపాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతున్నారు. ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు చట్టాలను వినియోగించుకోవాలన్నారు. సుప్రీం కోర్టు కక్షిదారుల మధ్య కేసులను త్వరగా పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కక్షిదారుల కేసులను పరిష్కరించేందుకు న్యావాదులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చామన్నారు. చట్టపరంగా ఎవరికైనా న్యాయం కావాలంటే తమను సంప్రదించాలని, ప్రభుత్వం ఉచితంగా న్యాయం పొందే అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఏజీపీ జ్వాలా నరసింహా, ప్యానల్ లాయర్లు సోమేసుల శివరామకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, న్యాయవాదులు ఇమాంబాషా, కరీముల్లా, అబ్దుల్ వహాబ్, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

కలసపాడు : క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని వైద్యాధికారి డాక్టర్ శైలజ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇంటెన్సిఫైడ్ టీబీ కాంపైన్ గురించి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియన్ పోస్టర్లను ఆవిష్కరించారు.

తపాలా కార్యాలయాల్లో సేవలు నిలుపుదల

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు తపాల డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా అన్ని రకాల సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రొద్దుటూరు డివిజన్ సూపరింటెండెంట్ జీ.కిరణ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తపాలా ఆధునీకరణలో భాగంగా అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 ద్వారా వినియోగదారులు సెల్‌ఫోన్ ద్వారా తపాలా సేవలను సులభంగా పొందే సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త విధానం అమలుకు సన్నాహక చర్యలో భాగంగా ప్రొద్దుటూరు, పులివెందుల హెడ్ పోస్టాఫీసులతోపాటు డివిజన్‌లోని 49 సబ్ పోస్టాఫీసులు, 325 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అన్ని లావాదేవీలను తాత్కాలికంగా నిలిపిస్తున్నట్లు వివరించారు. ఈ సమయంలో సాంకేతిక నవీకరణలు, సిస్టం మరమ్మతులు, సిబ్బందికి శిక్షణను చేపట్టనున్నట్లు తెలిపారు. తపాలశాఖ డాక్ సేవా మొబైల్ యాప్ ద్వారా బ్యాంకింగ్, బీమా, ఉత్తరాల బట్వాడా, ఇతర లావాదేవీలను రియల్ టైం ట్రాకింగ్ సౌకర్యంతో వినియోగదారులు సులభంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. తమ సెల్‌ఫోన్ల ద్వారా తపాల సేవలను వేగంగా, సురక్షితంగా పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వినియోగదారులు సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని లేదా తపాలా శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు అని సూచించారు.

బి.మఠం నూతన తహసీల్దార్‌గా కార్తీక్



నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కార్తీక్

బ్రహ్మంగారిమఠం : బి.మఠం నూతన తహసీల్దార్‌గా కె.కార్తీక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మూడు నెలలుగా రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కడప కలెక్టరేట్‌లో పనిచేస్తూ ప్రమోషన్‌పై తహసీల్దార్‌గా కార్తీక్ ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, సిబ్బంది పాల్గొన్నారు.